క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి (వాల్మీకిపురం) : పట్టణ పరిధిలోని డా.బిఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. ఎం.కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థినులు ప్రవేశాలకు అర్హులని, ఆసక్తి, అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మార్చి 06వ తేదీలోపు ఆన్‌లైన్‌లో లేదా నేరుగా పాఠశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 7989128742, 8331823512 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యాబోధనలో మెలకువలు పాటించాలి



అంగన్‌వాడీలకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ఇస్తున్న అధికారులు

కేవీపల్లె : విద్యాబోధనలో సరైన మెలకువలు పాటించాలని ఎంఈఓలు రెడ్డిబాషా, సుబ్రమణ్యంరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ వర్కర్లకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఆరు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఏ విధంగా బోధించాలనే అంశంపై శిక్షణ ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్, హెచ్ఎం వై. వెంకటరమణ, డీఆర్‌పీలు అన్నపూర్ణ, భారతి, శంకరమ్మ, మంకు రాజు, సుదర్శన్, హరికృష్ణ పాల్గొన్నారు.

పౌల్ట్రీఫామ్ యజమానికి నోటీసులు



పౌల్ట్రీఫామ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దమండ్యం : మండలంలోని శివపురంకు సమీపంలో పౌల్ట్రీఫామ్ నడుపుతున్న యజమానికి మంగళవారం నోటీసు జారీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు. పౌల్ట్రీఫామ్‌కు సమీపంలోని శివపురంలో ఈగల బెడద ఎక్కువ కావడంతో గ్రామస్థులు ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. దీంతో పౌల్ట్రీఫామ్‌ను ఎంపీడీఓ పరిశీలించారు. పారిశుద్ధ్యం లోపం లేకుండా చూసుకోవాలని యజమానికి సూచించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ గంగులమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అండగా నిలుస్తాం

కేవీపల్లె : వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం కేవీపల్లె మండలంలో పలు కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. మండలంలోని వగళ్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాదర్‌బాషా సోదరుడు అఫ్రోజ్ బాషా వలీమా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఎంపీపల్లె పంచాయతీ ఎర్రకొండక్కగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇరగంరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డిని పరామర్శించారు. కిచ్చిలివారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లపరెడ్డి రామిరెడ్డి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మీరెడ్డిగారిపల్లెకు చెందిన మహేష్‌రెడ్డి అవ్వ కంభం నాగముని మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, నాయకులు జయరామచంద్రయ్య, రామకొండారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, హబీబ్‌బాషా, యర్రమరెడ్డి, పి.ద్వారకనాథరెడ్డి, రాంప్రసాద్‌నాయుడు, యల్లయ్య, హర్షవర్ధన్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కలికిరి (వాల్మీకిపురం) : పట్టణంలో మొదటి సినిమా థియేటర్ సీతారం టాకీస్ వ్యవస్థాపకుడు మొర్రంరెడ్డి కుమార్ రెడ్డి రెండవ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక శ్రీ సాయి నారాయణ నిత్య అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన కుమారుడు రాంకుమార్ రెడ్డి మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో తన తండ్రి ముందుండేవారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానన్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల కమిటీ చైర్మన్ జాయకాయల క్రిష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతల ఆనందరెడ్డి, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, న్యాయవాది అశోక్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ : స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాల,వృద్ధాశ్రమంలో మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయ సీసీ ఇమ్రాన్ అన్నదానం చేశారు. వెలుగు పాఠశాల చేస్తున్న సేవలను కొనియాడారు. వెలుగులో నిర్వహిస్తున్న కార్యక్రమాలను కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనా కుమారి పాల్గొన్నారు.

అభివృద్ధి నిధులు మురిగిపోవాల్సిందేనా..?

- రూ.2.74 కోట్లు మంజూరై రెండేళ్లు
- మురుగు నీటి రీట్రీట్ ప్లాంట్, పెద్దచెరువు అభివృద్ధి ఏదీ?
- చెరువును శిథిలాలతో నింపేస్తున్నారు



పెద్దచెరువులోకి తరలించిన వ్యర్థాలు

బి.కొత్తకోట : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బి.కొత్తకోట నగర పంచాయతీకి మంజూరైన నిధులు సద్వినియోగం చేసుకోకపోవడంతో మురిగిపోతున్నాయి. మంజూరైన నిధులు అలాగే ఉండిపోతున్నాయి. దీనితో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందకుండా పోతున్నాయి. బి.కొత్తకోట పెద్దచెరువును అభివృద్ధి చేయడం, పట్టణంలోని మురికినీటిని మళ్లించి చెరువులోకి వెళ్లకుండా చేయడం, ఆదే నీటిని రీట్రీట్ చేసేందుకు చేపట్టాల్సిన పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. సర్వేలు పూర్తయినా ఫలితం లేకుండా పోతోంది. అమృత్ 2.ఒ కింద బి.కొత్తకోటకు రూ.2.74 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులు ఇప్పటికే నిరుపయోగంగా ఉన్నాయి.

చెరువు సుందరీకరణ :

రూ.2.74కోట్ల నిధులతో రెండు పనులు చేపట్టేలా అధికారులు నిర్ణయించారు. ఇందులో మొదటిది పెద్ద చెరువు సుందరీకరణ. ఈ చెరువు కట్ట అర కిలోమీటర్ ఉంది. ఈ కట్టపై నగర పంచాయతీ ప్రజలు సేదతీరేలా మొక్కలు, వాక్ ట్రాక్, లైటింగ్, పార్కు పనులు చేపట్టడం. కట్ట మొత్తం పచ్చదనం నిండేలా పనులు చేస్తారు. దీనితో ప్రజలకు ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుంది. ఇక్కడ కూర్చునేందుకు వీలుగా బెంచీలు కూడా ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం పట్టణంలోని మురికినీటి కాలువల నుంచి మురికినీరంతా ఈ పెద్దచెరువులోకి వచ్చి చేరుతోంది. దీనితో దుర్వాసన వస్తోంది. దీన్ని దూరం చేసేందుకు మురికినీటి కాలువన పంచాయతీవీధి రోడ్డు పక్కన సాగుతున్న కాలువలోకి మళ్లిస్తారు. మళ్లించిన మురికినీటిని శుద్ధి చేసే ప్రక్రియ చేపడ్తారు. రీట్రీట్ ప్లాంటును ఏర్పాటు చేసి నీటి శుద్ధి చేసి దాన్ని వినియోగించుకునేలా ప్రణాళికలను రూపొందిస్తారు. ఈ రెండు పనులు పట్టణ ప్రజలకు ఎంతో సౌకర్యం కలిగించేవి. అయినప్పటికి పనులు ఇంకా ప్రారంభం కాకపోడంతో నిధులు మురిగిపోతున్నాయి.

చెరువులోకి శిథిలాలు :

పెద్దచెరువు అభివృద్ధికి నిధులు మంజూరై ఉంటే.. మరోవైపు పెద్దచెరువు రోజు రోజుకు కుచించుకుపోతోంది. పట్టణంలో కూల్చేసిన భవనాల శిథిలాలను ట్రాక్టర్లలో తర లించి చెరువులోకి పోస్తున్నారు. కట్టపై రోడ్డు విస్తరణ కోసం 2016లో చెరువును పూడ్చి పనులు చేశారు. దీనితో చెరువు విస్తీర్ణం తగ్గిపోయింది. ప్రస్తుతం మళ్లీ శిథిలాలను తీసుకొచ్చి నింపేస్తున్నారు. మరోవైపు చెరువులో మట్టిని తోడేస్తున్న మట్టి మాఫియా దెబ్బకు ప్రమాదకర గుంతలతో నిండిపోతోంది. దీన్ని పట్టించుకోవాల్సిన రెవెన్యూ అధికారులు కనీసం స్పందించడం లేదు. పట్టణంలోని చెరువులో మట్టి తరలించి లక్షలు సొమ్ము చేసుకుంటున్నా చర్యలు కనిపించడం లేదు. ఇలాగే బయ్యాజీ చెరువునూ శిథిలాలతో చాలా వరకు నింపేశారు. రోడ్డుకు ఇరువైపులా 20 అడుగుల మేరకు శిథిలాలు నిండిపోయాయి. దీనితో చెరువు విస్తీర్ణం తగ్గింది. ఫలితంగా నీటినిల్వ విస్తీర్ణం కూడా తగ్గి రైతులకు కష్టాలు మిగలనున్నాయి. దీనిపైనా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రభావితం చేయగలిగిన వారే నాయకులవుతారు

ఎస్వీయూ మాజీ వీసీ శ్రీకాంత్ రెడ్డి



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

కురబలకోట : నాయకత్వం అంత సులభం కాదు.. ఎవరైతే పరిస్థితులకు, కాలానికి అనుగుణంగా మలచుకుంటూ ప్రభావితం చేయగలుగుతారో అలాంటి వారు గొప్ప నాయకులుగా ఎదుగుతారని తిరుపతి శ్రీ వేంకటేశ్వర (ఎస్వీ)యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ వి. శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో భవిష్యత్ నాయకుల కోసం వ్యక్తిత్వ వికాసం..వ్యక్తిగత, మానసిక అంతర్దృష్టులు అనే అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో వ్యక్తిత్వ వికాసం భవిష్యత్ నాయకులను తీర్చి దిద్దడంలో కీలకమైన అంశమన్నారు. జీవితంలోనైనా కేరీర్, మరే రంగంలో సక్సెస్ కావాలంటే నాయకత్వ లక్షణాలు తప్పనిసరియన్నారు. ఇందుకు గొప్ప వ్యక్తులను, వారి వ్యక్తిత్వాలను పరిశీలించడం ద్వారా విద్యార్థులతో పాటు ఎవ్వరైనా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చన్నారు.

ప్రజ్ఞ వికాస పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ



ప్రజ్ఞ వికాస పరీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజ్ఞ వికాస పరీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు సుధాకర్‌నాయుడు, గాలి రవీంద్ర మాట్లాడుతూ ఈనెల 22న జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాస పరీక్ష జరుగుతుందన్నారు. పబ్లిక్ పరీక్షల్లో భయాన్ని తొలగించి పరీక్షలకు సిద్ధం చేయడానికి నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజ్ఞ వికాస పరీక్షలు రాయడం ద్వారా విద్యార్థుల్లో చురుకుదనం పెరగడానికి ఇది ఒక మంచి అవకాశంగా తీసుకోవాలన్నారు. పరీక్ష ఎన్‌రోల్‌మెంట్‌కు 9010627332, 9390181240, 7396952402ను సంప్రదించాలన్నారు. కార్యక్రమం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఉపాధ్యాయులు బాబ్‌జాన్, రెడ్డిప్రసాద్, భారతి, సరళాదేవి, రెడ్డమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేస్తాం



వైఎస్సార్ సీపీ నాయకులను సన్మానిస్తున్న కార్యకర్తలు

రామసముద్రం : నియోజవర్గంలోని అన్ని మండలాల్లో వైఎస్సార్ సీపీని బలోపేతం చేస్తామని రామసముద్రం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన కేశవరెడ్డికి, మదనపల్లి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన దొడ్డి పల్లె ఆనంద పేర్కొన్నారు. మంగళవారం వారిని మండల నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి, దొడ్డిపల్లి ఆనంద మాట్లాడుతూ ఈ పదవీ బాధ్యతను అప్పగించినందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డికి నియోజకవర్గ ఇంచార్జ్ నిషార్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రుణాల చెల్లింపుపై అవగాహన



డ్వాక్రా రుణాల చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్న యూనియన్ బ్యాంక్ ఏజీఎం రామ్‌ప్రసాద్

మదనపల్లె : బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించడంపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో తిరుపతి యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్, ఏజీఎం రామ్‌ప్రసాద్, అవగాహన సమావేశంలో మాట్లాడుతూ..డ్వాక్రా పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా స్వయంసమృద్ధి సాధించేందుకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రుణాలు తీసుకున్న తర్వాత నిర్ణీత గడువులోపు తిరిగి చెల్లించాలన్నారు. రుణం చెల్లింపులో ఏవేని ఇబ్బందులు ఎదురైతే, వెంటనే బ్యాంకు అధికారులను సంప్రదించాలన్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిసే మళ్లీ రుణాలు పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు గోవర్ధన్, సీనియర్ మేనేజర్ పవన్, పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

మదనపల్లె : మున్సిపాలిటీ పరిధిలో స్వయం ఉపాధి కింద బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారు బుధ, గురువారం రెండురోజుల పాటు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ సర్టిఫికేట్లు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం తీసుకుని ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

546 దరఖాస్తులు

పీలేరురూరల్ : మండలంలో బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ రుణాలకు 546 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ జి. శివశంకర్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ 56 యూనిట్లు, ఈడబ్ల్యూఎస్ 10 యూనిట్లు, కాపు 10 యూనిట్లు మొత్తం 107 యూనిట్లకు దరఖాస్తులు కోరగా 546 దరఖాస్తులు అందాయి. బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

328 మందికి ఇంటర్వ్యూలు

గుర్రంకొండ : బీసీ కార్పొరేషన్ యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకొన్న 328 దరఖాస్తు దారులకు మంగళవారం ఎంపీడీవో వెంకటేశులు ఆధ్వర్యంలోఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని మొత్తం 15 గ్రామపంచాయతీలకు గానూ 46 బీసీ కార్పొరేషన్ యూనిట్లు మంజూరయ్యాయి.

కేవీపల్లెలో..

కేవీపల్లె : మండలంలోని బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ల రుణాలకు సంబంధించి మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుధాకర్ మాట్లాడుతూ ఇంటర్వ్యూలకు 188 మంది అభ్యర్థులు హాజరైనట్లు వివరించారు.

నేడు ఇంటర్వ్యూలు

ములకలచెరువు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హరినారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ

పీలేరు : పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో మానసిక ఆనందాన్ని అందించేలా విద్యను ప్రోత్సహించాలని ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఆటపాటలతో విద్యబోధన చేయాలని సూచించారు. కోర్సు ప్రాముఖ్యత, పూర్వ ప్రాథమిక విద్య ప్రధాన్యతపై అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఎం నటరాజన్, సీడీపీవో రాజమ్మ, రిసోర్స్ పర్సన్లు ఓబుల్‌రెడ్డి, సురేష్ బాబు, రేఖ, సూపర్‌వైజర్లు స్వరూప, అక్కయ్య, స్వర్ణ, ఉమ, సీఆర్‌పీ మురళీధర్‌రాజు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలను పరిశీలించాలి

బి.కొత్తకోట : పట్టణానికి కొత్తగా మంజూరైన ఇళ్ల లబ్ధిదారులకు ఉన్న సొంత స్థలాలను పరిశీలించాలని కమిషనర్ జీవీ.పల్లవి, హౌసింగ్ డీఈఈ వై.వెంకటరెడ్డి కోరారు. మంగళవారం నగర పంచాయతీ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన ఇళ్ల లబ్ధిదారుల స్థలాలు, వారి పత్రాలను పరిశీలన సత్వరమే పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేసేలా, నిర్ణీత లక్ష్యాలు సాధించేలా కృషి చేయాలని కోరారు. రూరల్ ఏఈ లావణ్య, ఇన్‌చార్జ్ అర్బన్ ఏఈ జియా, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అర్జున్, రాజశేఖర్‌రెడ్డి, వర్క్ఇన్స్‌పెక్టర్ అలీఖాన్ పాల్గొన్నారు.

ఆలయ ఆదాయభివృద్ధికి కృషి

నిమ్మనపల్లె : నేలమల్లేశ్వర స్వామి ఆలయ ఆదాయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, అందులో భాగంగా మహా శివరాత్రి సందర్భంగా ఆలయం వద్ద తాత్కాలిక దుకాణాల ఏర్పాటు, ఉత్సవాలకు వచ్చే వాహనాల రుసుం వసూలుకు త్వరలో మరోసారి వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మంజుల తెలిపారు. మంగళవారం ఆలయం వద్ద వేలం నిర్వహణకు ఈఓ మంజుల లోకల్ టెంపుల్స్ ఇన్స్‌పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయగా డిపాజిట్ దారులు తక్కువమంది హాజరు కావడంతో వేలం వాయిదా వేశారు. అనంతరం ఆలయ తాత్కాలిక కమిటీ చైర్మన్ మేష రామకృష్ణ, మాజీ కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, అర్చకులు శంకర శాస్త్రి లతో కలసి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు.

పక్కా గృహాల లేఅవుట్ పరిశీలన

పెద్దమండ్యం : పెద్దమండ్యంకు సమీపంలో ఉన్న పక్కాగృహాల లేఅవుట్‌ను తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ మంగళవారం పరిశీలించారు. లేఅవుట్‌లో ఎంత మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు..నిర్మాణంలో ఉన్న గృహాల సంఖ్యపై ఆయన ఆరా తీశారు. పట్టా పొంది నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. సకాలంలో బిల్లులు వస్తున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని లబ్ధిదారులు కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ అక్రమ్, వీఆర్వో విశ్వంభరనాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సందీప్ పాల్గొన్నారు.

బస్సుల కండీషన్ పరిశీలన

మదనపల్లె సిటీ : ప్రమాదాలు జగకుండా బస్సు కండీషన్ పరిశీలించడం జరుగుతుందని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణరెడ్డి అన్నారు. మంగళవారం ఆర్టీసీడిపోలో బస్సులను కండిషన్ పరిశీలించారు. బ్రేక్ స్టీరింగ్, ఎలక్ట్రికల్ వైరింగ్, బ్యాటరీ,డ్రైవర్, ప్యాసింజర్ సీట్లు, ట్రాన్సిషన్ సిస్టమ్ కండిషన్ పరిశీలించడం జరుగుతుందన్నారు. ప్రయాణికుల కోసం బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంఎఫ్ రవి, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి

తంబళ్లపల్లె : మండలంలోని ఎర్రసానిపల్లెలో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైపులైన్ దెబ్బతినడంతో తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. దీంతో చాలా దూరం వెళ్లి బోరు నుంచి నీటిని తెచ్చు కోవాల్సి వస్తోందన్నారు.

మున్సిపల్ కార్మిక సమస్యలపై పోరుబాట



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

మదనపల్లె : మున్సిపల్ కార్మిక సమస్యల పరిష్కారానికి పోరుబాట పట్టనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్రి సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీలను కలిసి డిమాండ్లపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత, నిర్వహణ, సాంఘికభద్రతపై మున్సిపల్‌శాఖకే పూర్తి బాధ్యతలు ఉండాలని, ప్రైవేట్ కంపెనీలు, ఏజెన్సీలకు అప్పజెప్పవద్దని డిమాండ్ చేశారు. కూటమిప్రభుత్వం ఏర్పాటై 8నెలలు పూర్తి అయినా ఇంతవరకు మున్సిపల్ కార్మికుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కరించలేదన్నారు. మున్సిపల్ కార్మికుల నిర్వహణ ప్రైవేట్, కంపెనీలకు, ఏజెన్సీలకు అప్పగించాలని రాష్ట్రప్రభుత్వం చేస్తున్న ఆలోచనను విరమించుకోవాలన్నారు. కార్మికులకు వేతనాలు ఇచ్చే బాధ్యత పూర్తిగా మున్సిపల్ శాఖ తీసుకోవాలని కోరారు. నగరాల్లో, పట్టణాల్లో రోజు రోజుకీ జనాభా పెరుగుతున్నప్పటికీ, కార్మికుల సంఖ్య మాత్రం 15ఏళ్లుగా అలాగే ఉందన్నారు. పట్టణ జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగ, కార్మికుల మాదిరిగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, కార్మికుల రిటైర్మెంట్ 62 ఏళ్లకు పెంచాలనే విషయమై ఫిబ్రవరి 19న ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఫిబ్రవరి 21న మస్టర్ల వద్ద నిరసన తెలిపి, 24న మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నా, 28న రౌండ్‌టేబుల్, మార్చి 3న కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు నిర్వహించి, మార్చి 6న చలో విజయవాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మస్తాన్, యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, పృథ్వీరాజ్, ముబారక్, నాగరాజు, వంశీ, ఓబులేష్, భాగ్యమ్మ, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన కూటమి ప్రభుత్వం



లక్కావాండ్లపల్లె కార్యకర్తలతో కలసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

గుర్రంకొండ : ప్రజల విశ్వాసాన్ని కూటమి ప్రభుత్వం కోల్పోయిందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రామాపురం పంచాయతీ వంకాయలవారిపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు పరసా కృష్ణమూర్తి ఇంటికి వెళ్లి ఇటీవల వివాహం జరిగిన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇదే పంచాయతీ లక్కావాండ్లపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరామచంద్రయ్యను, తలారి భాస్కర్‌లను పరామర్శించారు. అనంతరం లక్కావాండ్లపల్లెలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో ప్రజలు కూటమి పార్టీలపై విశ్వాసం ఉంచి ఓట్లు వేసి గెలిపించారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడునెలలు గడుస్తున్నా ఒక్క సంక్షేమ పథకం ప్రజలకు అందక పోవడం దారుణమన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు గాలిలో కలిసిపోయాయన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. అమ్మఒడి, రైతుభరోసా వంటి పథకాలకు ఈప్రభుత్వం ఈ ఏడాదికి మంగళం పాడిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రైతులకు ఉచిత పంటల బీమా అందించామన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పంటలబీమా ప్రీమియం మొత్తాన్ని రైతుల నెత్తినే వేయడం దారుణమన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గాల్లో కలిసి పోయాయన్నారు. సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఉత్తుత్తి పథకమే అని విమర్శించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎల్వీ రమణ, అప్పల్ల, చంద్రశేఖర్, మాజీ వైస్‌ఎంపీపీ రెడ్డినరసింహారెడ్డి, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, నాయకులు రాజారెడ్డి, అమరనాథరెడ్డి, చంద్రయ్య, భాస్కర్,రమణలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

కలకడ : మండలంలోని కదిరాయచెర్వు మాజీ సర్పంచ్ పుత్తంబాకం అనంతమ్మను మంగళవారం పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పరామర్శించారు. ఎంపీటీసీ సభ్యులు పురుషోత్తం నాయుడు తల్లి, మాజీ సర్పంచ్ అనంతమ్మ అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకుని వారి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



నిరసన తెలుపుతునన ఆశా కార్యకర్తలు

మదనపల్లె : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆశా వర్కర్స్‌కు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని, పనిభారాన్ని తగ్గించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ..ఆశా కార్యకర్తలకు 2019లో అప్పటికి ఇస్తున్న అన్ని అలవెన్సులు కలిపి రూ.10వేలు వేతనంగా నిర్ణయించారని, అప్పటి నుంచి ఇప్పటివరకు నిత్యావసర ధరలు పెరుగుతున్నా వేతనాలు పెంచలేదన్నారు. ఏఎన్ఎం, ఎల్‌హెచ్‌పీలు చేయాల్సిన పనులు ఆశా కార్యకర్తలతో చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పరీక్షల సందర్భంగా ఆశా కార్యకర్తలకు విధులు కేటాయించడం వేధింపుల్లో భాగమేనన్నారు. ఎన్ఆర్‌హెచ్ఎం కింద 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ మాట్లాడుతూ.. ఆశా వర్కర్స్‌తో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారే తప్ప కనీసవేతనం చెల్లించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్‌కు కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పనిభారాన్ని తగ్గించాలని, ఆన్‌లైన్ రికార్డు పనిని ఒకసారి మాత్రమే చేయించాలన్నారు. ఆశాలకు రూ.10లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ, ప్రభుత్వ, మెడికల్ సెలవులు ఇవ్వాలన్నారు. సంక్షేమ పథకాలు అమలుచేయాలని, ఇళ్ళ స్థలాలు కేటాయించి, ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. మరణించిన ఆశా కుటుంబంలో అర్హులైన వారిని ఆశాలుగా తీసుకోవాలన్నారు. ఏఎన్ఎం, హెల్త్ సెక్రటరీల నియామకాల్లో ఆశాలకు వెయిటేజీ ఇవ్వాలన్నారు. అనంతరం సబ్ కలెక్టరేట్ ఏఓ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమామణి, హారిక, గాయత్రి, మంజుల, మల్లేశ్వరి, పుణ్యవతి, సుజాత, పార్వతి, కిరణ్మయి, రమణమ్మ, గీత పాల్గొన్నారు.



